ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం

విశాలాంధ్ర - భీమిలి: స్థానిక ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ మాట్లాడుతూ స్థిరమైన సమాజాన్ని సృష్టించడానికి అక్షరాస్యత కీలక పాత్ర వహిస్తుందని, 2025 సంవత్సరానికి యునెస్కో డిజిటల్ యుగంలో అక్షరాస్యతను ప్రోత్సహించడం అనే థీమ్‌ను ప్రకటించిందని, విద్యార్థులు తమ గ్రామాల్లో ఉన్న ప్రజలకు డిజిటల్ అక్షరాస్యత పట్ల అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాహిత్య పోటీలలో విజేతలకు ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం జరిగింది. ఈ కార్యక్రమానికి హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఇంగ్లీష్ డి.మాధురి, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఆఫ్ తెలుగు డాక్టర్ డి.ప్రవీణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి.ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

అధికారులూ... తీరు మార్చుకోండి

పీజీఆర్ఎస్‌లో అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రజా సమస్యల పట్ల స్పందించే తీరులో మార్పురాకపోతే కఠిన చర్యలు తప్పవని సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను హెచ్చరించారు. గత వారం వచ్చిన ఫిర్యాదులు తీసుకున్న చర్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ఫిర్యాదులు చేస్తుంటే ఉన్నతాధికారులకు అడ్రస్ చేస్తూ ఎండార్స్మెంట్ ఇవ్వటమేంటని ప్రశ్నించారు. పోలీసు శాఖ, జీవీఎంసీ పరిధిలో వస్తున్న ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం దొరకటం లేదని నివేదికలు చూస్తే అర్థమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రణాళికా విభాగంలో నిర్లక్ష్యంగా సమాధానం రాసిన తీరును తప్పుపడుతూ సంబంధిత అధికారులను పిలిపించాలని సహాయ పట్టణ ప్రణాళికాధికారిని ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో నిర్లక్ష్యపు తీరు పునరావృతం అయితే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు తీసుకున్న అనంతరం ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 315 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 119, జీవీఎంసీకి చెందినవి 85, పోలీస్ శాఖకు సంబంధించినవి 21 ఉండగా వివిధ అంశాలకు, శాఖలకు చెందినవి మరొక 90 ఫిర్యాదులు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ తో పాటు, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో కవి బసు పోతనకు ద్వితీయ స్థానం

విశాలాంధ్ర - విశాఖ: పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమల లో ఈనెల 6, 7 తేదీల్లో యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ నిర్వహించిన 50వ యోగా పోటీల్లో విశాఖపట్నం చెందిన కవి, రచయిత బసు పోతన రెండో స్థానం సాధించారు. 45 సంవత్సరాలు దాటిన కేటగిరిలో ఆయన పోటీపడ్డారు. అక్టోబర్లో జాతీయస్థాయిలో మైసూర్‌లో జరిగే పోటీలకు రాష్ట్రాల నుండి ఆయన ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామారావు తెలిపారు. పోటీ చేసిన మొదటి సారి జాతీయ స్థాయికి చేరుకోవడం పట్ల బస్య పోతున్న ఆనందం వ్యక్తం చేశారు. తనకు శిక్షణ ఇచ్చిన అంతర్జాతీయ యోగా బహుమతి విజేత జెడి చక్రవర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

పర్యాటక రంగం అభివృద్ధికి వియత్నాంతో ఒప్పందం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగానికి మరింత వన్నె తెచ్చేందుకు వియత్నాంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు స్పెషల్ సిఎస్ అజయ్ జైన్ అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో ట్రావెల్స్ ఏజెన్సీ ప్రతినిధుల సహకారంతో వియత్నం ప్రధానమంత్రి అడ్వైజరీ బాడీ అసోసియేషన్ మెంబర్, వియత్నాం టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ చైర్మన్, చౌట్రీ యంగ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. వియత్నాంలో ఉన్న టూరిస్టులు బుద్ధిజంకు సంబంధించి బుద్ధగయ తదితర ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమరావతి కాలచక్రం, ఉమ్మడి విశాఖ జిల్లాలో బొజ్జన్న కొండలు, బావికొండ, తొట్లకొండ తదితర ప్రాంతాలను సందర్శించేందుకు వియత్నాం టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ చైర్మన్, చౌట్రీ యంగ్, స్పెషల్ సిఎస్ అజయ్ జైన్ ఎంఓయు మార్చుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వియత్నాం టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ చైర్మన్, చౌ ట్రీ యంగ్‌ను స్పెషల్ సిఎస్ అజయ్ జైన్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ శాలువతో సత్కరించారు. ఈ ఎంఓయు కార్యక్రమంలో టూరిజం శాఖ అధికారులు జె.మాధవి, జగదీష్, ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మూగ బాలికపై అత్యాచారం: ఇద్దరు నిందితుల అరెస్ట్

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: 11 సంవత్సరాల వయస్సు గల సరిగ్గా మాట్లాడలేని మైనర్ బాలికపై 16 సంవత్సరాల వయస్సు గల ఇద్దరు అబ్బాయిలు అత్యాచారం చేశారు. బాధితురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు విషయం తెలుసుకున్న సీపీ శంఖబ్రత బాగ్చీ వివరాలు సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. వెంటనే విచారణ ప్రారంభించి ద్వారకా నగర్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి నేరస్తులు ఇద్దరినీ అరెస్ట్ చేయడం జరిగిందని మద్యం మత్తులో ఆ యువకులు దారుణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

10న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లా పరిషత్ చైర్పర్సన్ అధ్యక్షతన ఈనెల 10వ తేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆమె ఛాంబర్ సమీపంలోని వి.సి. హాలులో, జడ్పీ సమావేశ మందిరంలో 1 నుంచి 7 వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10.00 నుంచి 12.00 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10.00 గంటలకు, 3, 4వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 11.00 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 12.00 గంటలకు జరుగుతాయని వివరించారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు, సంబంధించిన ప్రగతి నివేదికలతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని ప్రకటన ద్వారా కోరారు.

అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లిపురం నీలమ్మ వేప చెట్టు ప్రాంతానికి చెందిన బొంత అప్పలరాజు(55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆటోలో నుంచి బయటకు కనిపిస్తూ మృతదేహం ఉంది. సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గాయాలు ఏమీ లేవని.. కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

నేడు చాగంటికి 'కొప్పరపు కవుల' జాతీయ పురస్కారం ప్రదానం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ప్రఖ్యాత ప్రవచనకారులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు 2025వ సంవత్సరపు ప్రతిష్ఠాత్మకమైన కొప్పరపు కవుల జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 9వ తేదీ మంగ×వారం సాయంత్రం ఐదుగంటలకు కళాభారతి ఆడిటోరియంలో జరిగే శ్రీ కొప్పరపు కవుల కళాపీఠం 23వ వార్షికోత్సవానికి ముఖ్యతిది భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ, తదితరుల చేతులమీదుగా ఈ పురస్కార ప్రదానం జరుగనుంది. పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, అనుభవ పాత్రికేయులు మాచవరం వేంకట చెంచురామ మారుతి సుబ్బరాయ శర్మ (మా శర్మ) ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కార్యక్రమ నిర్వహణకు సన్నాహాలు పూర్తయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగే ఈ సభకు మాజీ మాజీ మంత్రివర్యులు మండలి బుద్ధప్రసాద్గౌరవ అతిథిగా, అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన లిపి సంస్థ ముఖ్య కార్యనిర్వహనాధికారి (సీఈఓ) సాగర్ అనిసింగరాజ ఆత్మీయ అతిథిగా పాల్గొంటారు. కళా,సాహితీ, సాంస్కృతిక రంగ ప్రియులంతా ఈ కార్యక్రమానికి ఆహ్వానితులేనని నిర్వాహకులు మా శర్మ చెప్పారు.

ఘనంగా జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జాతీయ నేత్ర దాన 40వ పక్షోత్సవాలు ఆగస్ట్ 25 నుండి సెప్టెంబర్ 8 వరకు జిల్లాలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, మోహ్సిన్ ఐ బ్యాంక్ సంయుక్తంగా నేత్ర దాన అవగాహన పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఈ 15 రోజులు ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాల సూపరింటెండెంట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. పాఠశాలలలో విద్యార్థులకి అవగాహన కల్పించి వారికి నేత్ర దాన ఆవశ్యకత గురించి వ్యాసరచన వక్తృత్వం పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేత్ర దానం చేసిన వారి కుటుంబ సభ్యులకు జిల్లా కలెక్టర్ సంతకంతో ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ శ్రీ లక్ష్మి, ఐ బ్యాంకు మేనేజర్ అభినీత్, ఆప్తాల్మిక్ ఆఫీసర్‌లు ఉమా శ్రీనివాస్, ఆర్.సురేష్, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాల సిబ్బంది, ఆంధ్ర మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును, ఏపీఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ టి.శివశంకర రావును కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. జీవీఎంసీ సాధారణ పద్దులలో 2024 నుండి ఇప్పటి వరకు దాదాపు 420 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఆరు నెలల బిల్లులు చెల్లింపులు జరిపి కాంట్రాక్టర్‌లకు ఆర్థిక భారం నుండి విముక్తి కల్పించాలని కోరారు. ఈ మధ్య కాలంలో కాంట్రాక్టర్లకు ఎంఎస్ఎంఈ ద్వారా టీఆర్ఈడీఎస్ అనే ప్లాట్‌ఫారంలో చెల్లింపులు చేయుటకు అవకాశం ఉందని టీఆర్ ఈడీఎస్ వారు జీవీఎంసీ కాంట్రాక్టర్లతో అవగాహన కార్యక్రమం జరిపి డిస్కౌంట్ బిల్లులు చెల్లింపులు చేస్తామని చెప్పారని, జీవీఎంసీ ఏడీసీ ఫైనాన్స్ వారు కాంట్రాక్టర్లను పిలిపించి ఎంఎస్ఎంఈ ద్వారా టీఆర్ఈడీఎస్ అనే ప్లాట్‌ఫారం ద్వారా చెల్లింపులు చేయుటకు అనుమతి కావాలని చెప్పడం జరిగిందన్నారు. దానిపై కాంట్రాక్ట్ అసోసియేషన్ వారు కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి కాంట్రాక్టర్ల అభిప్రాయం తెలుసుకుని జీవీఎంసీకి సమ్మతి తెలిపినట్టు తెలిపారు. కావునా టీఆర్ఈడీఎస్ ప్లాట్‌ఫారం మంచి కార్యక్రమం అని, ఇది అమలైతే కాంట్రాక్టర్లకు అన్ని విధాలా బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షులు పివివి నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, జి.సింహాచలం, మద్దాల రమేష్, సిరికి శ్రీనివాసరావు, షేక్ సిలార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.553 కోట్లుతో మధురవాడలో సీవరేజ్ ప్రాజెక్టు

జీవిఎంసి - ఐఎఫ్‌సి ట్రస్ట్ డీడ్ ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవిఎంసి) చారిత్రక మైలురాయిని అధిగమించిందని, దేశంలోనే మొట్టమొదటి అర్బన్ లోకల్ బాడీగా, అంతర్జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్‌తో నేరుగా ఆర్థిక ఒప్పందం చేసుకోవడం జరిగిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మున్సిపల్ పరిపాలన - పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ సమక్షంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఐఎఫ్‌సి ఆసియా హెడ్ విక్టోరియా డెల్మాన్ ట్రస్ట్ డీడ్‌పై సంతకాలు చేయడం జరిగింది. మధురవాడలో కాలువల మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఐఎఫ్‌సి రూ.498 కోట్ల పెట్టుబడి అందిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 400 కి.మీ.ల కాలువ నెట్‌వర్క్ విస్తరణతో పాటు, పంపింగ్ స్టేషన్లు, లిఫ్ట్ స్టేషన్లు నిర్మించబడతాయని, దీంతో మధురవాడ ప్రాంతంలో కాలువల కవరేజీ ప్రస్తుత 20% నుంచి 100% గృహాలకు విస్తరించనుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ డైరెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, ఐఎఫ్‌సి అధికారులు, జీవిఎంసి అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగాసన పోటీలకు మౌనిక

విశాలాంధ్ర - భీమిలి: ఆంధ్ర ప్రదేశ్ యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో ఈ నెల 6, 7 తేదీలలో జరిగిన 50వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలలో భీమిలికి చెందిన మల్లేటి మౌనిక రెండవ స్థానం పొందారు. 21-25 సంవత్సరాల విభాగంలో జరిగిన పోటీలలో విశేష ప్రతిభ చూపించి అక్టోబర్ నెలలో మైసూరులో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించింది. స్థానిక జెజె పవర్ జిమ్ విద్యార్థిని ఈ అర్హత సాధించడం పట్ల జిమ్ కోచ్ నల్ల శ్రీనివాసరావు ఆనందం వ్యక్తం చేసారు.

గీతంలో ప్రపంచ ఫిజియోథెరపి దినోత్సవం

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫిజియోథెరపి ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫిజియోథెరపి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైద్య రంగంలో ఫిజియో థెరపికి ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. గీతం స్కూల్ ఫిజియోథెరపి ప్రిన్సిపాల్ డాక్టర్ రంగనాథ్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఆరోగ్యకరమైన జీవన విధానం ప్రధాన అంశంగా ఈ ఏడాది ప్రపంచ ఫిజియో థెరపి దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫిజియోథెరపి విభాగం నిపుణుడు డాక్టర్ వంశీ మాట్లాడుతూ ప్రపంచంలో 2050 నాటికి వృద్ధుల సంఖ్య 80 శాతం మేరకు పెరగ నుందని, భారత దేశంలో 70 శాతం మంది వృద్ధులు గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారని తెలిపారు. ఫిజియోథెరపి అవసరం వృద్ధులకు ఎక్కువగా ఉంటుందన్నారు. ఆరోగ్యకరమైన ఆహా రపు అలవాట్లు, కొద్దిపాటి వ్యాయామం నడక, మెదడును చురుకుగా ఉంచుకోవడం, సామా జికంగా వివిధ కార్యక్రమంలో పాల్గొనడం వంటివి వృద్ధాప్యంలో సహితం ఆరోగ్యకరమైన జీవితాన్ని అనుభవించడానికి దారితీస్తాయని సూచించారు. కార్యక్రమంలో జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు తదితరులు పాల్గొన్నారు. ఫిజియో థెరపి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

అభ్యంతరంలేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు అవకాశం: ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి: అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకోవడానికి జీఓ 296 ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సూచించారు. పెందుర్తి మండలంలో జీవో నెంబర్ 296 ద్వారా అభ్యంతరంలేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ పథకంలో పట్టాలు పొందిన వారి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పెందుర్తి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. పట్టణ ప్రాంతంలో దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ భూములపై అభ్యంతరం లేని ఆక్రమణలను క్రమబద్ధీకరించడానికి జీవో నెంబర్ 296ను అనుసరించి పెందుర్తి మండలంలో 2014 - 15 సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్న వారికి 2016 - 17 సంవత్సరంలో పట్టాలు పొందిన వారిలో ప్రస్తుతం 2927 మందికి రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని, అవకాశాన్ని బట్టి ప్రజలకు ప్రయోజనం చేకూర్చుతోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి సబ్ రిజిస్టర్ కీర్తి ప్రియా, మండల రెవెన్యూ అధికారి వెంకట అప్పారావు, వీఆర్వో ముత్యాల శెట్టి, సీనియర్ డాక్యుమెంట్ రైటర్ చిన్నారావు, మండల పార్టీ అధ్యక్షులు కొరుపోలు రామునాయుడు, వార్డు అధ్యక్షులు పిన్నింటి పార్వతి, రాపర్తి కిషోర్, సదరం భీమేశ్వరరావు, గొర్లె అప్పారావు, ఆర్.ఎస్. నాయుడు, గండి దుర్గాప్రసాద్, తనకాల శ్రీనివాస రావు,కోరుకొండ వరహాలు, అంబటి వెంకటేశ్వరరావు, గన్రెడ్డి రమేష్, షేక్ బ్రుహన్, పెందుర్తి మండల రెవెన్యూ అధికారులు, పెందుర్తి సబ్ రిజిస్టర్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పిన స్ప్రింగ్ స్పీడ్ స్కూల్ బస్సు

గాయాలతో బయటపడ్డ విద్యార్థులు

విశాలాంధ్ర - పద్మనాభం: మహారాజుపేట నుంచి పద్మనాభం ప్రధాన రహదారి పాండ్రంగి జంక్షన్ దాటిన తర్వాత బంకవారి కల్లాలు ఎదురుగా ప్రధాన రహదారి వద్ద పక్కనే ఉన్న ఖాళీ పొలంలోకి స్ప్రింగ్ స్పీడ్ స్కూల్ బస్సు దూసుకెళ్లింది. ప్రధాన రహదారి నుండి పొలం సుమారు పది నుంచి 15 అడుగుల లోతులో ఉంటుంది. పూర్తిగా అదుపుతప్పిన బస్సుకు రోడ్డు పక్కన ఉన్న చెట్లు దేవుడిలా కాపాడాయి. వేగంగా వచ్చి పక్కకు ఒరగడంతో బస్సు లోపల ఉన్న విద్యార్థులకు గాయాలయ్యాయి. కనకల యశస్విని, సరగడ సాహిత్య అనే విద్యార్థులకు బలమైన గాయాలయ్యాయి. కనకల యశస్విని తండ్రి కనకల నారాయణ జరిగిన ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్కూల్ యాజమాన్యంపై కొంతమంది స్థానికులు మండిపడ్డారు. స్కూల్లో చాలా బస్సులు ఉండగా కొన్ని బస్సులు ఉదయం రెండు ట్రిప్పులు తిరగడం వల్ల సమయానికి ఈ స్కూలు పిల్లలను స్కూలుకు చేర్చడానికి బస్సు డ్రైవర్లు వేగంగా నడపాల్సి వస్తుందని లేటుగా వస్తే యాజమాన్యం తిడుతుందని స్కూల్ బస్సులు వేగంగా నడపడం వల్లే ఈ ప్రమాదాలకు కారణమని వాపోతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలుగా శైలజ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం బంటుపల్లి గ్రామపంచాయతీ వేములవలస ఎఫ్‌హెచ్‌లో విధులు నిర్వహిస్తున్న శైలజ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. 1996లో ఉపాధ్యాయ వృత్తిలో చేరి, విద్యార్థుల ప్రగతికి ఉన్నత బాటలు వేస్తూ, ఉన్నత జ్ఞానవంతులుగా చేయుటకు, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి, అహర్నిశలు ప్రయత్నించారు. ఇప్పటివరకు సర్వీస్ మొత్తాన్ని పరిగణంలోకి తీసుకున్న ఆమెను విద్యార్థులు తీర్చిదిద్దడంలో విద్యారంగానికి సహకరించడంలోనూ తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రకటించిన జాబితాలో అవార్డును శైలజకి ప్రకటించారు. అందులో భాగంగా విశాఖ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, విశాఖ జిల్లా ఇన్చార్జ్ డోల బాల వీరాంజనేయులు, పార్లమెంట్ సభ్యులు భరత్ చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేశారు. అవార్డు రావడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శైలజ తెలిపారు.

సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - తగరపువలస : విశాఖ నగరంలో 2025 డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు జరుగనున్న సిఐటియు అఖిలభారత మహా సభలను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు ఎం.జగ్గనాయుడు కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు. సీఐటీయూ భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో చిట్టి వలస జ్యూట్ మిల్ కళ్యాణ మండపంలో సోమవారం వివిధారంగాల కార్మికులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మహాసభలకు దేశం నలుమూలల నుంచి కార్మిక నేతలు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సదస్సులు, సెమినార్లు, చర్చా గోష్ఠి లాంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 4న నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని, వీటన్నింటినీ జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభల్లో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సిఐటియు భీమిలి జోన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పల నాయుడు, ఆటో, ముఠా, ఆశా, అంగన్వాడి కార్మికులు హాజరయ్యారు.

అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు

విశాలాంధ్ర - మల్కాపురం: పరిశ్రమల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాలు మరోసారి జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పివి గణబాబు పేర్కొన్నారు. ఈస్ట్ ఇండియా పెట్రోలియం కంపెనీలో ఆయిల్ ట్యాంకర్‌పై అగ్ని ప్రమాదం జరగడం అందరికీ తెలిసిందే. ప్రాథమిక దర్యాప్తులో ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నివేదిక ప్రకారం ఈ ప్రమాదం పిడుగులు, ఉరుముల వలన జరిగిందనే భావన వ్యక్తమైంది. ట్యాంకర్‌లో నిల్వ ఉన్న మెత్తనోల్ అవశేషాలపై మెరుపులు పడిన కారణంగా మంటలు చెలరేగి ఉండొచ్చని తేలింది. ఈ ఘటన వెంటనే అదుపులోకి తెచ్చి, పరిస్థితి పూర్తిగా నియంత్రణలోకి వచ్చిందని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని అన్ని భద్రతా చర్యలు అమలుపరచాలని ఆయా కంపెనీలు, మేనేజ్‌మెంట్‌కు ఆదేశాలు జారీ చేసింది. కంపెనీలు అన్ని భద్రతా ప్రమాణాలను పాటించడం తప్పనిసరని, మెరుపులు, ఉరుముల వల్ల సంభవించే ప్రమాదాలను నివారించడానికి అవసరమైన లైట్నింగ్ అరెస్టర్ అంటే మెరుపు అరెస్టర్ లేదా సర్జ్ డైవర్టర్‌లి లైట్నింగ్ ప్రొటెక్షన్ సిస్టమ్స్, ఎర్తింగ్ సదుపాయాలు సరిగా అమలులో ఉన్నాయా లేదా అన్నది ప్రత్యేక బృందం ద్వారా పరిశీలిస్తామన్నారు.

విశాలాంధ్ర ▸ విశాఖపట్నం
పేజి: 2
మంగళవారం 9, సెప్టెంబర్ 2025

శ్రీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గం సుజాతనగర్ రత్నగిరి నగర్ కాలనీలో ఉత్తరాంధ్ర జిల్లాలో హుండీ లేని ఆలయంగా పేరుగాంచిన శ్రీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు సోమవారం దర్శించుకున్నారు. ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ ధర్మకర్త మొగ్గ ఈశ్వరరావు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రాజా సుధాకర్, కరణం కనకారావు, అయితే సింహాచలం, మురళి రాజు, కృష్ణంరాజు ,జగన్మోహన్ పాత్రుడు, గొర్లె అప్పారావు,గుమ్మిడి ధర్మరాజు, సదరం భీమేశ్వరరావు, ఆర్ఎస్ నాయుడు మొదలగు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భీమిలి రెవెన్యూ తీరుపై భగ్గుమన్న మండల ప్రతినిధులు

విశాలాంధ్ర - భీమిలి: మండల రెవిన్యూ పనితీరుపై మండల ప్రతినిధులు బగ్గుమన్నారు. సోమవారం ఎం.పి.పి. వసురాజు ఆధ్వర్యంలో మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశంలో వైస్ ఎం.పి.పి. బోనీ బంగారు నాయుడు రెవిన్యూ పని తీరు ఎండ గడుతూ వారు చేసిన అవకతవకలు వివరించారు. రీ సర్వే పేరుతో భూములు రికార్డ్స్ గ్రామాల్లో మార్పు చేసారని చెప్పారు. జాయింట్ ఎల్.పి.ఎంలు విషయంలో అధికార్లు ఉదాసీన వైఖరి కారణంగా రైతులు అవస్తలు పడుతున్నారని చెప్పారు. తనకు సంబంధించిన భూమి సర్వే స్థానికంగా సరిగ్గా రాశారని జాయింట్ కలెక్టర్ పరిధిలో మార్పు జరిగిపోయిందని ఈ విషయంలో తనకు సమాచారం కావాలని కోరగా అధికారులు స్పందించలేదని చెప్పారు. సింగన బంధ సర్పంచ్ గాడు నారాయణ మాట్లాడుతూ తన పంచాయతీలో జాయింట్ ఎల్.పి.ఎం. సమస్యతో రైతాంగ భూములు విక్రయించుకోలేని పరిస్తితి ఉందని చెప్పారు. భీమిలి మండలంలో జగన్ స్థలాల్లో గృహాలు నిర్మించిన వారి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్ ఇవకుండా రెవెన్యూ అధికార్లు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని బొడ్డు దుర్గారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమిలి మండలం నాగమయపాలెం పంచాయతీ మొత్తం ఫారెస్ట్ ల్యాండ్స్‌గా చూపిస్తున్నారని అక్కడ నివసించే వారి పరిస్తితి ఏంటని దుర్గారావు ప్రశ్నించారు. ఎం.పి.పి. వాసుసురాజు మాటాడుతూ మండలానికి 8 కోట్లు నిధులు విడుదల కాలేదని శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావును మండల ప్రతినిధులు నిధులు విడుదల చేయించమని కోరుతామని చేసిన ప్రతిపాదన అందరూ ఆమోదించారు. సమావేశంలో గాడు వెంకటప్పుడు, మండల అధికారి నరసింహారావు, పంచాయతీ అధికారి రమేష్ నాయుడు, రెవెన్యూ డి.టి. ప్రసాద్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ధరల తగ్గింపును ప్రకటించిన టయోటా కిర్లోస్కర్ మోటార్స్

విశాలాంధ్ర - విశాఖపట్నం: కస్టమర్ ఫస్ట్ ఫిలాసఫీ పట్ల తన అచంచలమైన నిబద్ధతను కొనసాగిస్తూ, ప్రతి టచ్ పాయింట్ వద్ద సంతోషకరమైన అనుభవాలను అందించే లక్ష్యంతో, టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీ కే ఎం) జీఎస్టీ రేటు తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు పూర్తిగా అందించనున్నట్లు ప్రకటించింది. సవరించిన ధరలు సెప్టెంబర్ 22, 2025 నుంచి అమల్లోకి రానున్నాయని టికేయం సేల్స్ విభాగ హెడ్ వరిందర్ వాధ్వా తెలిపారు. ఈ చారిత్రాత్మక సంస్కరణకు భారత ప్రభుత్వానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ నిర్ణయం వినియోగదారుల కొనుగోలు శక్తిని పెంచడమే కాకుండా, ఆటోమొబైల్ రంగంపై ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసింది. పండుగ సీజన్‌ను ముందుకు తీసుకెళ్తున్న ఈ చర్య మార్కెట్‌లో బలమైన ఉత్సాహాన్ని కలిగించి, డిమాండ్‌ను వేగవంతం చేస్తుందని మేము ఆశిస్తున్నాము. అన్నారు. పారదర్శకమైన మరియు వినియోగదారుల-కేంద్రీకృత సంస్థగా, ఈ ప్రయోజనాలను మా వినియోగదారులకు అందించడం పట్ల మేము ఆనందంగా ఉన్నాము. ప్రపంచ స్థాయి మొబిలిటీ పరిష్కారాలను మరింత అందుబాటులోకి తీసుకురావడంలో మా అచంచల నిబద్ధత కొనసాగుతుందన్నారు. డిమాండ్‌ను పెంపొందించే, మొబిలిటీని అందరికీ చేరువ చేసే మరియు సామూహిక ఆనందాన్ని సృష్టించే ఇటువంటి సంస్కరణలను మేము హర్షిస్తున్నాము. ఇవి కేవలం వినియోగదారుల ప్రయోజనాలకే కాకుండా భారతదేశం యొక్క స్థిరమైన మరియు సమగ్ర వృద్ధి ప్రయాణానికి కూడా దోహదం చేస్తాయి. అని చెప్పారు. టయోటా వాహనాలు గ్లాంజా పై రూ. 85,300 వరకు, టైసర్ పై రూ. 1,11,100 వరకు, రూమియన్ పై రూ. 48,700 వరకు హైరైడర్ పై రూ. 65,400 వరకు , క్రిస్టా పై రూ. 1,80,600 వరకు , హైక్రాస్ పై రూ. 1,15,800 వరకు ఫార్చ్యూనర్ పై రూ. 3,49,000 వరకు, లెజెండర్ , రూ. 3,34,000 వరకు, హిలక్స్ పై రూ. 2,52,700 వరకు , కామ్రీ పై రూ. 1,01,800 వరకు, వెల్ఫైర్ పై రూ. 2,78,000 వరకు తగ్గింపు అవకాశం ఉందని చెప్పారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత తిరుమల శ్రీదేవికి ఘన సన్మానం

విశాలాంధ్ర - భీమిలి: (ఫ్రెండ్స్) అసోసియేషన్ భీమిలి (ఫాబ్), హిందూ ధర్మ పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ అందుకున్న మాదాబత్తుల తిరుమల శ్రీదేవిని ఘనంగా సన్మానించారు. భీమిలిలోని వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో ముందుగా అవార్డ్ గ్రహీత మాదాబత్తుల తిరుమల శ్రీదేవిని చిన్న బజార్ ఎన్‌టిఆర్ విగ్రహం దగ్గర నుండి సన్ స్కూల్ ఎన్‌సిసి క్యాడెట్ల బ్యాండ్‌తో పండిట్ నెహ్రూ పాఠశాల వరకూ ఊరేగింపుగా తీసుకుని వెళ్లారు. అనంతరం జరిగిన సభలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి కన్వీనర్ మైలపల్లి షణ్ముఖరావు మాట్లాడుతూ భీమిలికి చెందిన ఉపాధ్యాయురాలు జాతీయ స్థాయిలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయురాలు పురస్కారం అందుకోవడం చాలా గొప్ప విశేషమని, భీమిలికి జాతీయ స్థాయిలో ఈ అవార్డు ద్వారా గుర్తింపు తెచ్చిన తిరుమల శ్రీదేవికి భీమిలి ప్రజలందరి తరపున అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫాబ్ ప్రతినిధులు కాళ్ళ సన్నీ, ముసునూరి సూర్య శ్రీనివాస్, మారోజు గోపి, గుగ్గిళ్ళ సాయి, పెంటపల్లి దేవానంద్, కట్టమూరి అశోక్, కట్టమూరి రమణరావు, చుండూరి మూర్తి, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కోట మల్లిక్, ఫోరం ఫర్ బెటర్ భీమిలి అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణ మూర్తి, కాళ్ళ లావణ్య, మైలపల్లి భారతి తదితరులు పాల్గొన్నారు.

పీకేఎల్ ఆఫ్ ది మ్యాట్
గీతంలో కబడ్డీ సందడి చేసిన తెలుగు టైటాన్స్

విశాలాంధ్ర - మధురవాడ: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్ సందర్భంగా గీతం యూనివర్సిటీలో కబడ్డీ సందడి నెలకొంది. పీకేఎల్ నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, అభిమానులు తెలుగు టైటాన్స్ ఆటగాళ్లను కలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి పీకేఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఇ.ప్రసాద్‌రావు, గీతం అసిస్టెంట్ డీన్ అరుణ్ కార్తీక్ కూడా హాజరయ్యారు. ప్రసాద్‌రావు, అరుణ్ కార్తీక్ కబడ్డీ ఆట అభివృద్ధి, యూనివర్సిటీ స్థాయిలో క్రీడల ప్రాముఖ్యత, యువ క్రీడాకారులను ప్రోత్సహించడంలో పీకేఎల్ పాత్ర గురించి ఆసక్తికరంగా మాట్లాడారు. పీకేఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఇ.ప్రసాద్‌రావు మాట్లాడుతూ “కబడ్డీ కేవలం ఆట మాత్రమే కాదని, ఇది మన సంస్కృతి, మన అస్తిత్వం. ఒకప్పుడు చిన్న పల్లెటూరి ఆటగా మొదలైన కబడ్డీ, ఇప్పుడు పీకేఎల్ కారణంగా ప్రపంచ వేదికపై ఒక గొప్ప క్రీడగా మారిందన్నారు. బీచ్‌ల నుంచి ఇండోర్ అరేనాలకు, ఆసియా గేమ్స్ నుంచి ప్రపంచ వేదికకు ఈ ఆట పూర్తిస్థాయిలో రూపాంతరం చెందిందన్నారు. భారతదేశం కబడ్డీలో తొలి ఒలింపిక్ స్వర్ణ పతకం సాధించే రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు. చివర్లో ఆయన, “మీరు కోటీశ్వరులు కావాలంటే, ప్రో కబడ్డీ లీగ్‌లో చేరండి!” అని సరదాగా వ్యాఖ్యానించారు. అనంతరం విద్యార్థులు, యూనివర్సిటీ కబడ్డీ క్లబ్ సభ్యులు ఆటగాళ్లతో నేరుగా ముఖాముఖి నిర్వహించారు. వృత్తిపరమైన క్రీడాకారుల జీవితం గురించి విద్యార్థులు ఎన్నో ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. తెలుగు టైటాన్స్ కెప్టెన్ విజయ్ మాలిక్‌లి మాట్లాడుతూ “నేను ఒక చిన్న గ్రామం నుంచి వచ్చాను, కానీ కబడ్డీ నా జీవితాన్ని మార్చేసిందన్నారు. ఈ ఆట వల్ల భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కూడా మమ్మల్ని కబడ్డీ ఆటగాళ్లుగా గుర్తించడం ఒక కల నిజమైనట్లు అనిపిస్తుందని, ఇంతకంటే ముఖ్యంగా, కబడ్డీ మా కుటుంబాలకు అండగా నిలబడే శక్తిని ఇచ్చిందన్నారు. ఆటగాళ్లతో సరదా ఆటలు, క్విజ్ సెషన్స్ నిర్వహించడంతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా సాగింది.

జివిఎంసి “ప్రజా సమస్యల పరిష్కార వేదిక”కు 105 వినతులు



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 105 వినతులు వచ్చాయని జివిఎంసి అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జివిఎంసి అదనపు కమిషనరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న“ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 105 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్‌కు 01, 2వ జోన్ కు 19, 3వ జోన్ కు 12, 4వ జోన్ కు 15, 5వ జోన్‌కు 19, 6వ జోనుకు 14, 8వ జోన్ కు 11, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 14 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ అకౌంట్సు విభాగమునకు 04, రెవెన్యూ విభాగమునకు 13, ప్రజారోగ్య విభాగమునకు 08, పట్టణ ప్రణాళిక విభాగమునకు 57, ఇంజినీరింగు విభాగమునకు 14, యుసిడి విభాగమునకు 09 కలిపి మొత్తంగా 105 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమీషనర్లను అదనపు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, ఫైనాన్సర్ అడ్వైజర్ మల్లికాంబ, సిసిపి ఏ.ప్రభాకర రావు, పర్యవేక్షక ఇంజనీర్లు పల్లమరాజు, కె.శ్రీనివాసరావు, డిడిహెచ్ ఎం.దామోదరరావు, డీసీపీలు కె.వెంకటేశ్వరరావు రామ్మోహన్, మధుసూదనరావు, యుసిడి - డిపిఓలు విజయశంకర్, శాంతి కుమారి, ఏసీపీలు, సివిఒ డా.ఎల్.రవికుమార్, స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, బయాలజిస్ట్ సాంబమూర్తి, టి.పి.ఆర్.ఓ రజినికుమారి, తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలపై కూటమికి కపట ప్రేమ

వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అణగారిన వర్గాలపై కపట ప్రేమ చూపిస్తుందని వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు అన్నారు. వైసీపీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షులు, 53వ వార్డ్ కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఇమామ్‌లు, మౌజన్‌లకు ఇవ్వాల్సిన గౌరవ వేతనాలు చెల్లించకపోవడంపై జిల్లా కలెక్టర్ ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాన్ని కొనసాగిస్తామని, సూపర్ సిక్స్ అమలు చేసి సంక్షేమం, సంపద సృష్టించే విషయంలో ఇచ్చిన మాటపై నిలబడతామని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన తర్వాత సంక్షేమ పథకాలు అమలు చేసే విషయంలో ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ కులాలు, మతాల మధ్య చిచ్చులు పెట్టే విధంగా ట్వీట్ చేశారని తెలిపారు. ఇమామ్లు, మౌజనులకు గత 15 నెలల బకాయిలను అసెంబ్లీ సమావేశాలు జరిగే లోపు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇమ్రాన్, వైసిపి సీనియర్ నాయకులు జహీర్ అహ్మద్, పేడాడ రమణకుమారి, స్టేటస్ మైనారిటీ సెల్ జెనరల్ సెక్రటరీ కేవి బాబా, కో ఆప్షన్ మెంబర్ షరీఫ్, యాసీన్ మసీద్ సహాయ కార్యదర్శి మొహమ్మద్ ఇబ్రహీం (అలియాస్) దేవరకొండ మార్కండేయులు, వైసీపీ 73,వ వార్డుఅధ్యక్షులు షోకత్ అలి, వైసీపీ 39 వ వార్డు అధ్యక్షులు ముజీబ్ ఖాన్,మొల్లి అప్పారావు పాల్గొన్నారు.

ఏపీ స్టేట్ 8వ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ -2025 తుది ఫలితాలు

విశాలాంధ్ర - పెందుర్తి : ఏపీ స్టేట్ 8వ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ -2025 సెప్టెంబర్ 7న శ్రీనివాస ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ వేదికగా, ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదిత్య చెస్ అకాడమీ ఆర్గనైజర్‌గా నిర్వహించినట్లు ఆల్ విశాఖ ఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రంగల బాబురావు తెలియజేశారు. వివిధ జిల్లాల నుంచి మొత్తం 230 క్రీడాకారులు పాల్గొనగా గర్ల్ అండర్ -6- రేణు శ్రీ 4 పాయింట్లు తో మొదటి స్థానం, బోయ్ అండర్ 6- అభినవ్ వైద్యభూషణ 4 పాయింట్లుతో మొదటి స్థానం, గర్ల్ అండర్ 8- మనస్వి నక్కల 3.5 పాయింట్లు తో మొదటి స్థానం, బోయ్ అండర్ 8- శశాంక్ కుంచ 6 పాయింట్లు తో మొదటి స్థానం గర్ల్ అండర్ 10- గిరీష్ మా అనంతలక్ష్మి 3.5 పాయింట్లు తో మొదటి స్థానం, బోయ్ అండర్ 10- సార్థ్వేష్ 4.5 పాయింట్లు తో మొదటి స్థానం, గర్ల్ అండర్ 12- శ్రీ లక్ష్మీ మన్విత 4.5 పాయింట్లు తో మొదటి స్థానం, బోయ్ అండర్ 12- జశ్విన్ వడ్డీ 4.5 పాయింట్లు తో మొదటి స్థానం, గర్ల్ అండర్ 14- అంజన కోనూరు 4 పాయింట్లు తో మొదటి స్థానం, బోయ్ అండర్ 14- వాకాడ శ్రీరామ్ జైన్ 5.5 పాయింట్లు తో మొదటి స్థానం, గర్ల్ అండర్ -16- లక్ష్మీ ప్రియ బట్ట 3 పాయింట్లు తో మొదటి స్థానం, బోయ్ అండర్ 16- వెంకటేశ్వర రావు వెంపర్ల 4 పాయింట్లుతో మొదటి స్థానం సాధించినట్లు వెల్లడించారు.

విజేతలకు ముఖ్య అతిథులు చేతులు మీదుగా బహుమతి ప్రధానోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కృష్ణమోహన్ వద్దాది ఫార్మర్ రిజిస్టర్ ఆంధ్ర యూనివర్సిటీ, రవీంద్ర ఎడ్యుకేషన్ అలవార్డాస్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ జి.శ్రీనివాసరావు, జియో ఫిజిక్స్ ఆంధ్ర యూనివర్సిటీ, ఎంవి రావు, వైస్ ప్రెసిడెంట్ ఆంధ్ర చెస్ అసోసియేషన్ టోర్నమెంట్ డైరెక్టర్ మణికంఠ, సెక్రెటరీ ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ రామకృష్ణ, డైరెక్టర్ ఆదిత్య అకాడమీ డిప్యూటీ ఆర్బిటర్ ఎం వి ఎస్ ప్రసాద్ నరేష్, ఎం ఎస్ పి కుమార్, కిరణ్ ,జ్ఞానేశ్వర్రావు, త్రినాథ్ శ్రీకాంత్,అనిల్, తరుణ్, శ్రవణ్, రవి, బ్రహ్మ, గీత, సుబ్బు. గెలిచిన విజేతలను అభినందించారు. కె వి వి శర్మ చీఫ్ అడ్వైసర్ ఆంధ్ర చెస్ అసోసియేషన్, ఏ సురేష్ ప్రెసిడెంట్ ఆంధ్రా చెస్ అసోసియేషన్, డాక్టర్. ఆర్ బాబురావు ప్రెసిడెంట్ ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ పాల్గొన్నారు.

5కె రన్ విజేతలకు కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఇంటర్నేషనల్ యూత్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా జిల్లా స్థాయి మారథాన్ 5కె రెడ్ రన్ పరుగు పందాలను, జిల్లా క్రీడా విభాగం వారి సహకారంతో రాక్ బీచ్ విశాఖపట్నం నందు వివిధ కాలేజీ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనగా డిఎంహెచ్ఓ డా. జగదీశ్వరరావు, డాక్టర్ రోనంకి రమేష్ ,జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టిబి అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ అధికారి జెండా ఊపి జిల్లా స్థాయి మారథాన్ 5కె రెడ్ రన్ పరుగు పందాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ రన్‌లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ ప్రశంసా పత్రాలను జిల్లా అధికారులు చేతులమీదుగా అందజేశారు. ఈ మారథాన్ 5కె రెడ్ రన్ వీజేతలకు జిల్లా కలెక్టర్ వారి చేతుల మీదుగా నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను బాలురకు, బాలికలకు, టీజీలకు అందచేయడం జరిగినది. బాలుర విభాగంలో మొదటి బహుమతి పదివేలు ప్రభుత్వ కృష్ణ కాలేజీ విద్యార్థి వేదవ్యాస్, రెండవ బహుమతి ఏడు వేలు సమత డిగ్రీ కాలేజీకు చెందిన సురేష్‌కు దక్కింది. బాలికల విభాగంలో మొదటి 10 వేలు బహుమతిని డివై దాక్షాయిని, సమత డిగ్రీ కాలేజీ, రెండవ బహుమతిని 7 వేలు అమూల్య మని, సేంట్ లూకాస్ కాలేజీ గెలుపొందారు.

ఆడారి ఆనంద్‌కు కార్పొరేటర్ ముమ్మన శుభాకాంక్షలు

విశాలాంధ్ర - పెందుర్తి: భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన ఆడారి ఆనంద్ కుమార్‌ను పెందుర్తి బిజెపి నాయకులు, జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు మర్యాద పూర్వకంగా కలిసారు. అనకాపల్లి ఎంపీ కార్యాలయంలో ఆడారి ఆనంద్ కుమార్‌ను కలిసి శాలువాతో సత్కరించి, పూలబొకే అందచేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బిజెపి 95, 97వ వార్డుల అధ్యక్షులు చిక్కాల సతీష్, సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన వెంకట సంతోష్, సెక్రెటరీ కొత్తపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: సెప్టెంబర్ 23 నుంచి ప్రారంభిస్తున్న అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ ప్రైమ్ సభ్యులకు ఒకరోజు ముందుగానే అందుబాటులోకి రానుందని అమెజాన్ డాట్ ఇన్ క్యాటగిరి డైరెక్టర్ శ్రీ వాత్సవ్ వెల్లడించారు. పండగ సీజన్ కోసం భారతదేశం సిద్ధమవుతుండగా, కస్టమర్లు అత్యంత వేగంగా గొప్ప ధరలకి విస్తృతమైన ఎంపిక కోసం ఎదురుచూడవచ్చు అని, స్మార్ట్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, సౌందర్యం, గృహ అవసరాలు, కిరాణా మరియు ఇంకా ఎన్నో వాటితో సహా అన్ని ప్రసిద్ధి చెందిన శ్రేణుల్లో ఆకర్షణీయమైన డీల్స్ తో లీనమయ్యే షాపింగ్ అనుభవాలు అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ అందిస్తుంది అన్నారు. ఎస్బిఐ క్రెడిట్ %ం% డెబిట్ కార్డ్స్ పై 10 శాతం తక్షణ డిస్కౌంట్, ఈ ఎం ఐ లావాదేవీలు, ప్రముఖ బ్యాంక్స్ నుండి ఉత్తేజభరితమైన ఆఫర్లు మరియు అమేజాన్ పే ఐసిఐసిఐ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ పై అదనపు క్యాష్ బ్యాక్‌తో ప్రతి ఒక్కరు ఈ అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ లో పొందవచ్చు అని చెప్పారు. “దేశపు అతి పెద్ద షాపింగ్ సంబరం కోసం కస్టమర్లు, సెల్లర్స్ మరియు బ్రాండ్స్ ను ఒక చోట చేర్చడం ద్వారా భారతదేశపు పండగల స్ఫూర్తిని ద అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సంబరం చేస్తోందన్నారు. ఈ ఏడాది, కస్టమర్లు ఒక లక్షకు పైగా ఉత్పత్తులు, బ్లాక్ బస్టర్ డీల్స్, ఉత్తేజభరితమైన కొత్త విడుదలలు, పాల్గొనే వినోదం మరియు ఇంకా ఎన్నో వాటిపై ఈ సంవత్సరంలో అతి తక్కువ ధరలను పొందవచ్చు అన్నారు. ఉత్తేజభరితమైన డీల్స్ తో పాటు లక్షలాది ఉత్పత్తులపై జీఎస్టీ లో తగ్గింపును కూడా సెల్లర్స్ ప్రణాళిక చేసారని ఈ అమేజాన్ గ్రేట్ ఇండియన ఫెస్టివల్ కి కస్టమర్లు గొప్ప ఆదాల కోసం ఎదురుచూడవచ్చు అని తెలిపారు.

గెలాక్సీ ట్యాబ్ ఎస్ 11 సిరీస్‌ను ప్రారంభించిన శాంసంగ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశపు అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన శాంసంగ్, ఈరోజు గెలాక్సీ ట్యాబ్ ఎస్ 11 అల్ట్రా మరియు గెలాక్సీ ట్యాబ్ ఎస్ 11ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇది ఇప్పటివరకు అత్యంత తెలివైన మరియు అధునాతన టాబ్లెట్ అనుభవాన్ని అందిస్తుంది. గెలాక్సీ ట్యాబ్ ఎస్ 11 సిరీస్, ప్రో-గ్రేడ్ హార్డ్‌వేర్‌ను పెద్ద స్క్రీన్ కోసం ఆప్టిమైజ్ చేసిన అనుభవాలతో కలపడం ద్వారా ప్రయాణంలో అప్రయత్నమైన ఉత్పాదకత కోసం నిర్మించబడింది. గెలాక్సీ ట్యాబ్ ఎస్ 11 అల్ట్రా ఇప్పటివరకు వచ్చిన గెలాక్సీ ట్యాబ్‌లలో అత్యంత సన్ననిది. పనితీరులో రాజీ పడకుండా, ఇది ఒక ప్రీమియం టాబ్లెట్ ఎలా ఉండగలదో చూపించడానికి సన్నని ఫార్మ్ ఫ్యాక్టర్‌ను మించిపోతుంది. గెలాక్సీ ట్యాబ్ ఎస్ 11 అల్ట్రా కేవలం 5.1 మిమీ మందం మరియు 692 గ్రాముల బరువు మాత్రమే ఉంటుంది. దీని మునుపటి మోడల్ 5.5 మిమీ మరియు 718 గ్రాముల బరువును కలిగి ఉంది. అధునాతన ఏఐతో రోజువారీ పనులకు శక్తి తెస్తుంది. వినియోగదారులు టైప్ చేసే, మాట్లాడే మరియు చూసే వాటిని అర్థం చేసుకుని, నిజ సమయంలో సహాయకరమైన సూచనలతో ప్రతిస్పందిస్తుంది. ఈ సాధనాలు ఏ పనిలోనైనా మరింత సులభంగా పని చేయడానికి, సృష్టించడానికి మరియు ప్రవాహంలో ఉండటానికి వీలు కల్పిస్తాయి. ట్యాబ్ ఎస్ 11 సిరీస్ జెమిని లైవ్‌తో వస్తుంది, ఇది నిజ-సమయ స్క్రీన్ షేరింగ్ మరియు విజువల్ ఇన్‌పుట్‌ను అనుమతిస్తుంది, కాబట్టి వినియోగదారులు వారు చూస్తున్న దాని గురించి జెమినితో సహజమైన సంభాషణ చేయవచ్చు. అది స్క్రీన్‌పై ఉన్న కంటెంట్ అయినా లేదా ఎవరైనా కెమెరాను దాని వైపు చూపిస్తూ చూపించాలనుకుంటున్న వస్తువు అయినా జెమిని లైవ్ యూజర్ చూసేదాన్ని చూడటం ద్వారా సందర్భోచిత ప్రశ్నలు మరియు అభ్యర్థనలను నిర్వహించగలదు.

విశాఖపట్నంలో ‘ఘర్ ఘర్ సోలార్’ ప్రారంభించిన టాటా పవర్ రెన్యువబుల్స్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశపు పునరుత్పాదక విద్యుత్ రంగంలో అగ్రగామి, టాటా పవర్ యొక్క అనుబంధ సంస్థ అయిన టాటా పవర్ రెన్యువబుల్స్, విశాఖపట్నంలో తమ ఫ్లాగ్‌షిప్ ‘ఘర్ ఘర్ సోలార్’ కార్యక్రమాన్ని ఆవిష్కరించింది. విశ్వసనీయమైన సర్వీసు మరియు కస్టమర్ కేర్ దన్నుతో, అత్యంత నాణ్యమైన, చౌకైన, సోలార్ సొల్యూషన్స్‌ను అందించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌వ్యాప్తంగా రూఫ్‌టాప్ సోలార్ వినియోగానికి ఊతమివ్వడం ఈ ప్రోగ్రాం యొక్క లక్ష్యం అని టాటా పవర్ ఎండీ డాక్టర్ ప్రవీర్ సిన్హా, టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ డైరెక్టర్ సంజయ్ బంగా వెల్లడించారు. ప్రత్యేకంగా రాష్ట్రం కోసం పండుగ సీజన్ స్కీమ్‌ను టాటా పవర్ సోలారూఫ్ ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో పలు ఆకర్షణీయమైన ఫీచర్లు ఉన్నాయని,

ముందుగా కేవలం రూ. 999 చెల్లించి సోలార్ సిస్టంను ఇంటికి తీసుకెళ్లవచ్చు అన్నారు. సిస్టమ్ వ్యయానికి సంబంధించి 100 శాతం రుణాన్ని పొందవచ్చు అని, రూ. 2,203 నుంచి ప్రారంభమయ్యే అఫోర్డబుల్ ఈఎంఐల వెసులుబాటును పొందవచ్చు అని చెప్పారు. ఈ స్కీము కింద సరళతరంగా 60 నెలల వరకు కాలవ్యవధి, వేగవంతమైన ప్రాసెసింగ్ కోసం తక్షణ డిజిటల్ రుణ అప్రూవల్స్, అలాగే బోనస్‌గా రెసిడెన్షియల్ కస్టమర్లందరికీ టాటా ఏఐజీ నుంచి 1 ఏడాది పాటు సోలార్ ఇన్సూరెన్స్ పాలసీ కాంప్లిమెంటరీగా లభిస్తుందన్నారు. దశాబ్దకాలం పైగా భారత్‌లో దిగ్గజ రూఫ్‌టాప్ సోలార్ ప్రొవైడర్‌గా సేవలందిస్తున్న, టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ (టీపీఆర్ఈఎల్) విభాగమైన టాటా పవర్ సోలారూఫ్ ఈ సమగ్రమైన ప్రయోజనాలను తమ కస్టమర్లకు అందిస్తోందని తెలిపారు.

బొడ్డపాలెంలో చిన్నారి మృతి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం బోడ్డపాలెం గ్రామంలో సోమవారం ఆత్మహత్య చేసుకొని చిన్నారి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. రాయగడ తలకెడ గ్రామానికి చెందిన తానే నిశిక కుమార్తె (14) ప్రస్తుతం బొడ్డపాలెం ఎవర్గ్రీన్ ప్లైవుడ్ కంపెనీలో పనిచేస్తున్నట్లు సమాచారం. కంపెనీ నుండి పనులు ముగించుకొని ఇంటికి వచ్చి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని చనిపోయినట్లు తెలుస్తోంది. అందిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతురాలు బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తామని ఆనందపురం పోలీసులు తెలిపారు. అయితే మృతురాలు వేరే అతనితో ఒకే ఇంట్లో ఉండటం వల్ల పలు అనుమానాలకు దారితీస్తుంది ఆత్మహత్య చేసుకుందా, హత్య అనే విషయంపై పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.